# కలనైనా నీ తలపే!

విజయ పెళ్ళయిన రెండ్రోజులకి వెళ్ళాడు కమలాకర్.

"ఏమిటి అన్నయ్యా! యిలా చేశావ్!" అంది విజయ.

"నేనేం చెయ్యను! అవతల పెనుతుఫాను కదా!"

"ఏమిటి మనవాళ్ళంతా తలలు పట్టుకు కూర్చున్నారు" అన్నాడు, కమలాకర్.

"ఏం చెప్పమంటావురా! భయంతో ఛస్తున్నాం! ఈ కొత్తల్లుడు తలలు మార్చి తలలు పెడతాడుట!" అన్నాడు, కమలాకర్ బాబయ్య.

"మరి వాకబు చెయ్యకుండా యీ సంబంధం ఎలా ఖాయపరిచారు?"

"వాకబు చెయ్యకేం! చేశాం కాని, ఎవరూ, యీ తలలు మారుస్తాడన్న విషయం చెప్పలేదు."

"నిజమే! తలకాయవున్నవాడెవ్వడూ చెప్పడు. చెపుతే, వాడి తల ఏమవుతుందోన్న భయం వుంటుంది కదా!".

"నువ్వొచ్చిన తర్వాత కొంచెం ధైర్యంగా వుందిరా! కమలాకర్!"

"నేను కూడా యిప్పుడే వెళ్ళిపోతాను బాబయ్యా! అసలే నాది తెలివైన బుర్రకాయ! ఏ పనికిరాని తలైనా తీసి, నాకు పెట్టాడనుకో నా వుద్యోగం పోతుంది!" అన్నాడు కమలాకర్.

"బాగుంది వరస! అంటే మా తలలు ఏమయిపోయినా ఫర్వాలేదన్నమాట! రేపు సత్యనారాయణ వ్రతమైన తర్వాత వెళ్ళు".

ఆ మర్నాడు సత్యన్నారాయణ వ్రతానికి వెళ్ళిన కమలాకర్ విజయ భర్తను చూసి "హలో! భుజంగం నువ్వా! శుభలేఖలో భుజంగరావ్ అని చూసి ఎవరో నవమన్మథుడను కొన్నాను" అన్నాడు.

"అయితే మా అల్లుడు నీకు ముందే తెలుసేమిట్రా, నిజంగా తలలు మారుస్తాడా!" అని అడిగాడు కమలాకర్‌ని అతని బాబయ్య.

"చిన్నప్పుడు హైస్కూల్లో చదివేరోజుల్లో తలలు మార్చిన మాటనిజమే! ఓసారి డ్రిల్లుమాస్టారి తల తీసి సైన్స్ మాస్టారికి, సైన్స్ మాస్టారి తలతీసి డ్రిల్ మాస్టారికి పెట్టేసాడు. ఆ దెబ్బతో సైన్స్ మాస్టారు పిల్లలచేత డ్రిల్లు చేయించారు. హెడ్‌మాస్టారు డ్రిల్ మాస్టార్ని పిలిస్తే, ఆయన కనిపించలేదట! తర్వాత సైన్స్ లేబరేటరీలో రసాయనాలతో ఆడుకుంటూ కనిపించారట, మా డ్రిల్ మాస్టారు.

ఈ ఘనత భుజంగానిదేనని తెలుసుకున్న హెడ్‌మాస్టారు, "వీడు పెద్దయిన తర్వాత, ఏ రాజకీయ నాయకుడో అవుతాడు" అన్నారు.

తర్వాత యింకోసారి పెద్ద గొడవయింది. తెలుగు మాస్టారికి, లెక్కల మాస్టారికీ ఒకరితల ఒకరికి పెట్టేశాడు

లెక్కల మాస్టార్ని పిలిచి సిలబస్ పూర్తయిందా అని అడిగిన హెడ్‌మాస్టార్‌తో, "అస్తమానం సిలబస్ గురించే మీ ఆవేదన! జీతాల పెరుగుదల గురించి ఆలోచించరు", అంటూ "అడిగిన జీతం బియ్యని" అనే పద్యం చదివారట. ఈ లెక్కల మేస్టరు తెలుగు పద్యం చదవడమేమిటని, మళ్ళీ భుజంగం తలలు మార్చేసాడేమోనని, అనుమానం వచ్చిన హెడ్‌మాస్టర్, ఓ సారి తెలుగుమాస్టార్ని కూడా పిలిపించారట.

"ఏం మాస్టారూ! సిలబస్ అయిపోయిందా" అని అడిగేరట, తెలుగు మాస్టార్ని.

"ఇంకా ఆల్‌జీబ్రాలో కొంతభాగం పూర్తి చెయ్యాలి!" అన్నారట తెలుగుమాస్టారు.

అప్పుడు హెడ్‌మాస్టార్‌గారు భుజంగాన్ని పిలిపించి, "ఈ తలలు మార్చడం మానకపోతే నిన్ను చంపేస్తాను" అని గట్టిగా బాదేసారు.

సత్యనారాయణ వ్రతమైన తర్వాత, "ఏరా! భుజంగం బాగున్నావా! ఇంకా తలలు మారుస్తున్నావా! అని అడిగాడు కమలాకర్.

"జాగ్రత్తగా వుండు ఇప్పుడు నీ చెల్లెలు మొగుడ్ని!"

"తెలుసురా! అన్నీ తెలుసు. ఈరోజు శోభనపు పెళ్ళికొడుకువి కూడా!"

శోభగం గదిలో తన భార్య జడలో వున్న మల్లెపూలు వాసన చూడబోయాడు భుజంగం.

"మీ దగ్గరకు రావాలంటే భయంగా వుందండి! మీరు తలలు మారుస్తారని చెప్పాడు మా అన్నయ్య!"

"అది ఎప్పటి మాటో! ఏం భయపడకు! చీకట్లో కూడా భయపడకు" అని, దీపం ఆర్పేసాడు భుజంగం.

"నాకేం భయం! ఊరికే అన్నాను! అసలు తలలు మార్చేవారే నా చెప్పు చేతల్లో వుంటే నాకేం భయం!" అంది విజయ.

---

"ఆ కమలాకర్ వెధవని నిద్రలేపండి! నిద్రలోనే నవ్వుకుంటున్నాడు. ఈ వెధవకి రోజూ కలలే!" అన్నాడు, కమలాకర్ రూమ్మేట్స్‌లో ఒకడు.

"నాయనా కమలాకరం! మంచి కల ఏదైనా కంటున్నావా, ఖర్చు లేకుండా!

ఆఫీస్ టైమ్ అవుతోంది! లే బాబూ!" అని లేపాడు, యింకో రూమ్ మేట్.

"మంచి కలరా! ఆ భుజంగంగాడికీ, మా బాబయ్య కూతురు విజయకి వివాహమైనట్లు కల వచ్చిందిరా!"

"ఎవడు! తలలు మారుస్తాడని చెప్పుకునే వాళ్ళం హైస్కూల్లో, ఆ భుజంగమేనా!"

"అవున్రా వాడే! ఏమిటో చిత్రం! మా బాబయ్య కూడా, తన అల్లుడు భుజంగం తలలు మారుస్తాడని భయపడుతున్నట్లు కల వచ్చింది."

"సర్లే! ఈరోజురాత్రి శోభనమైనట్లు యింకో కల కను!"

"శోభనం నిన్నటి కలలోనే అయిపోయింది. ఇక బారసాలే తరువాయి!" అన్నాడు కమలాకర్.

"బాబూ! నీ కలలు టి.వీ. సీరియల్స్ రా!

ఈ రోజుకి కలల గొడవ చాలించి ఆఫీస్‌కి నడు."

---

(రంజని దసరా దీపావళి 2009)